సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు

- రౌతుకుంటలో సంక్షేమ పథకాల పంట
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



దిన్నెమీదపల్లెలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సంబేపల్లె : సంక్షేమాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అడుగులు వేస్తున్నారని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రౌతుకుంట పంచాయతీలోని బోయపల్లె, దిన్నెమీదపల్లె, వంగిమళ్లవారిపల్లె, సీతారామపురం, కుంటలముందరపల్లెలలో డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు ఆయన వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బోయపల్లెలో నీటి సమస్యను పరిష్కరించేందుకు 3 సింటెక్స్‌ ట్యాంకులు, మోటర్లు, పైప్‌లైన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతే కాకుండా జల్‌జీవన్‌ మిషన్‌ పథకం కింద రూ. 19 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దుర్గంకొండ హరిజనవాడ ప్రజలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిల పాలన మా జీవితాలలో మార్పులు తెచ్చాయని ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌ పాలన సాగుతోందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్‌ నిలుస్తున్నారన్నారు. ఎస్సీల పక్షాన జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. బడుగు బలహీన వర్గాలకు సీఎం జగన్‌ రాజకీయంగా పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామాలకు పాలన తీసుకువచ్చామన్నారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు, సలహాలు, సూచనలు, సమస్యల పరిష్కారం చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికి వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్‌ జగన్‌కే దక్కుతుందన్నారు. అవసరం ఉన్న చోట అంగన్‌వాడీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాడు – నేడు కార్యక్రమాన్ని తీసుకొచ్చి విద్యాలయాలను కార్పొరేట్‌ స్కూళ్ల కంటే మెరుగ్గా వసతులు కల్పించామన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోరే ప్రభుత్వానికి బాసటగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రతి గడపలో తెలియజేశారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతి రూపం గ్రామ సచివాలయం

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం గ్రామ సచివాలయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గడికోట ప్రారంభించారు. వలంటీర్‌ వ్యవస్థ ద్వార ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలు అందింజేస్తున్నామన్నారు. సచివాలయాలకు కోట్లాది రూపాయలతో శాశ్విత కార్యాలయ భవనాలు నిర్మించి పల్లెల మార్పుకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కవిత, ప్రముఖ న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి, నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ హసీన, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి, ఎంపీటీసీ భద్రయ్య, నూర్‌అహమ్మద్‌, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ వడ్డివెంకటరమణరెడ్డి, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తహసీల్దార్‌ మహేశ్వరీబాయ్‌, ఎంపీడీఓ నరసింహులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



రోడ్లను పరిశీలిస్తున్న ధనుంజయరెడ్డి

రైల్వేకోడూరు అర్బన్‌ : మండలంలోని అనంతరాజుపేట తంబళ్లవారిపల్లెలో రాజ్యసభ నిధులు రూ. 25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఆదివారం ముఖ్యమంత్రి సలహాదారు రక్కాసి ధనుంజయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ఆయన ఆశయాలకు తగ్గట్టు ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధిపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ పంజం సుకుమార్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : మండలంలోని పాన్నేటిపాళ్యం అటవీ ప్రాంతంలో ఆదివారం ఎస్‌ఈబీ సిబ్బంది జరిపిన దాడుల్లో 100 లీటర్ల సారా స్వాధీనంతో పాటుగా తయారీ దారులు ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌ను ఆదుకోండి



అగ్నిప్రమాద బాధితుడు కిరణ్‌

రైల్వేకోడూరు : మండలంలోని కె.బుడుగుంటపల్లి పంచాయతీ సమతానగర్‌లో నివాసం ఉంటున్న కిరణ్‌ కుమార్‌ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి ఇంటికే పరిమితమయ్యాడు. శనివారం ఆయన్ను ఆదుకోవాలని ఆటో ఓనర్స్‌ అసోసియేషన్‌ వారు కోరారు. అలాగే కిరణ్‌ కుటుంబానికి నెలపాటు సరిపడే బియ్యం, కూరగాయలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌ ఇంటికే పరిమితం కావడంతో కుటుంబాన్ని పోషించడం కష్టమవుతోందని ప్రభుత్వం, దాతలు ఆదుకుని ఆయనకు ఆపరేషన్‌ చేయించి ఆర్థిక సహాయం అందించాలని ఆటో యూనియన్‌ సమతానగర్‌ నాయకులు కోరారు.

బోనాల సమర్పణ



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీలో వెలసిన శ్రీ సుంకులమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం గ్రామంలో బోయపల్లె వాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు, మహిళలు తలపై బోనాలు పెట్టుకొని అమ్మవారిని స్మరిస్తూ అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

బాక్సింగ్‌ క్రీడాకారులకు నగదు వితరణ



క్రీడాకారులతో ముక్కా సాయివికాస్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్‌ : ఫిబ్రవరి నెలలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్‌ పోటీలలో కోడూరుకి చెందిన ఎస్కే స్పోర్ట్స్‌ అకాడమీ విద్యార్థులు 11 మంది జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్‌ తరఫున ముక్కా సాయి వికాస్‌రెడ్డి క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.50 వేల నగదును అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్తుమారమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న నాయకులు

నందలూరు(రాజంపేట) : ముత్తుమారమ్మ జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లెలో కొలువైన ముత్తుమారమ్మకు ధర్మకర్త ఏలుమలై ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు హాజరైన సర్పంచ్‌ సూర్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎముక దుర్గయ్య, ఎస్‌.ఆదినారాయణ, టి.శివశంకర్‌, పి.శివకుమార్‌, రాజా, మట్టిబాబు, ఎ.వెంకటరమణ, మురళీ పూజారి, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

రాజంపేట రూరల్‌ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో నడిపించిన అతి చిన్న వయస్సు గల ప్రధాని రాజీవ్‌ అని కొనియాడారు.

ఆలయానికి విరాళం

గాలివీడు : మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం హరిజనవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం ఆలయానికి కసిరెడ్డి శివారెడ్డి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు కలువగా రూ. 35 వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటాద్రి, శివగంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నవాజ్‌ క్రిష్‌లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట) : ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయక నిధి ఒక వరంలాంటిదని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం సుండుపల్లెలో బెస్తపల్లికి చెందిన షేక్‌ సులేమాన్‌కు రూ. 3లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ నిధులు మంజూరు కాగా ఆదివారం చెక్కును ఎమ్మెల్యే మేడా అందజేశారు. కార్యక్రమంలో సుండుపల్లె ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆ ఊరిలో.. ఆక్రమణల్లోనూ పోటీపడుతున్నారు

- నల్లపరెడ్డిపల్లెలో ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకున్న గ్రామస్తులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, ఆర్‌ అండ్‌ బీ, సచివాలయ అధికారులు



గ్రామంలోని ప్రధాన రహదారిపై మట్టి వేసి ఆక్రమించుకున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని నల్లపరెడ్డిపల్లె గ్రామం నుంచి వెళ్తున్న వంకను గ్రామస్తులు కొంతమంది ఆక్రమించారు. దీంతో ప్రాథమిక పాఠశాలకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. హైస్కూల్‌ ఎదురుగా ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ నుంచి గ్రామం మీదుగా ఓ వంక వెళ్తుంది. ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ పక్క నుంచి ఆక్రమణదారులు మట్టిపోసి సిమెంట్‌ రోడ్డు కంటే ఎత్తుగా ఆక్రమించడంతో వర్షపునీరంతా పాఠశాలలోకి వెళ్లనుంది. అలాగే పాఠశాల ప్రహరీగోడ వంకకు ఆనుకొని కట్టడంతో మురుగునీరు నిల్వ ఉండి ప్రహరీ పడిపోయే ప్రమాదం పొంచిఉందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి గ్రామం మీదుగా వెళ్తున్న వంకను అనేక మంది ఆక్రమణ చేశారు. ఓ చోట గ్రామంలో సిమెంట్‌ రోడ్డుపై ఇరుపక్కలా ఆక్రమించడంతో కేవలం ఆటో వెళ్లేందుకు కూడా దారిలేదు. ఓ వ్యక్తి రోడ్డును కూడా ఆక్రమించడంతో ఎదురుగా ఉన్నవారు తాము కూడా ఆక్రమిస్తామని ఏకంగా సిమెంట్‌ రోడ్డుపై కాంక్రీట్‌ వేసి రాకపోకలు స్తంభింపజేశాడు. ఇరుపక్కల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడంతో ఆటో వెళ్లేందుకు మాత్రమే స్థలం ఉంది. ఆక్రమణపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒకరికొకరు పోటీలుపడి వంకతోపాటు రోడ్డును ఆక్రమించడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. హైస్కూల్‌కు పక్కన ఉన్న రోడ్డు, వంకను కూడా ఆక్రమించడంతో వర్షపునీరు నిల్వ ఉండి రోగాల బారిన పడే అవకాశాలున్నాయని ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక సచివాలయ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై నల్లపరెడ్డిపల్లె సెక్రటరీని వివరణ కోరగా ప్రభుత్వ స్థలం ఆక్రమించింది వాస్తవమేనని పెద్దమనుషులను తీసుకువెళ్లి వారితో చర్చించి ఆక్రమణలు తొలగించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలి

రాయచోటి అర్బన్‌ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు, స్కీం వర్కర్లను వెంటనే రెగ్యులర్‌ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వశాఖలలో మూడు లక్షల మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వీరికి స్కీం వర్కర్లు ఉన్నారు. ఏనాటికైనా ప్రభుత్వం రెగ్యులర్‌ చేస్తుందన్న ఆశతో సేవలందిస్తున్నారంటూ తెలిపారు. ఈ తరుణంలో ప్రభుత్వం కొందరు కాంట్రాక్టు ఉద్యోగులనే రెగ్యులర్‌ చేస్తుండడం ఉద్యోగులలో ఆందోళనను, అసంతృప్తిని రేకెత్తిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌, స్కీం వర్కర్లు అందరిని రెగ్యులర్‌ చేయాలంటూ డిమాండ్‌ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, మండల అధ్యక్షుడు రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

వాల్మీకిపురం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస, శ్రీవిద్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆదివారం చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఇంటింటా దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు నీటి నిల్వలు, దుర్గంధం నివాసాల పరిసరాలలో ఉండకుండా చూసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ సుధాకర్‌, శారద, ఎల్‌టి సురేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ఇంటి పరిసరాలలో దోమలను నివారించినప్పుడు కీటక జనిత వ్యాధులు దూరమవుతాయని వైద్య విధానపరిషత్‌ ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల డాక్టర్‌ విక్రాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో భాగంగా వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌ సర్కిల్‌లో దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలేకుండా చూడాలన్నారు. దోమల లార్వా నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమకాటు జ్వరాల భారీన పిల్లలు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, వైదయ సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌ వద్ద డయాబెటిక్‌ ఆస్పత్రి

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌ కింద కాండ్లమడుగు వద్ద లయన్స్‌క్లబ్‌ ఆఫ్‌ హార్సిలీహిల్స్‌ ద్వారా డయాబెటిక్‌ హాస్పిటల్‌ను నిర్మించనున్నట్టు లయన్స్‌ డిస్ట్రిక్ట్‌ కార్యదర్శి మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దపల్లె సమీపంలోని ఫాంహౌస్‌లో లయన్స్‌ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి నిర్మాణం కోసం స్థలాన్ని మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి సముఖత వ్యక్తం చేశారని చెప్పారు. భవన నిర్మాణాలకు లయన్స్‌ డిస్ట్రిక్ట్‌ తరఫున రూ.80లక్షల నిధులు అందుతాయని చెప్పారు. ఆక్సిజన్‌ సేవలు అవసరమైన వారికోసం బెంగళూరుకు చెందిన లయన్‌ భానుమూర్తి రెడ్డి రూ.80వేలతో ఆక్సిజన్‌ కాన్సన్‌ట్రేటర్‌ విరాళంగా ఇచ్చారన్నారు. పేదలకు అన్నదానం, పశువైద్య శిబిరాల నిర్వహణ, వృద్ధాశ్రమాలను ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నట్టు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాజంపేట : మండలంలోని ఆకేపాడు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 13 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు మన్నూరు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం రాజంపేట మండలంలోని ఆకేపాడు ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై తమ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. అంతే గాకుండా అక్కడ ఉన్న పేక ముక్కలతోపాటు రూ. 42,300 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

జగనన్న పాలన పట్ల పెరిగిన ప్రజాభిమానం



వెంకటమరమణ

చిట్వేలి : సీఎం జగన్‌ పరిపాలన పట్ల రోజురోజుకు ప్రజలలో అభిమానం పెరిగిపోతున్నదని, ఎవరెన్ని కుయుక్తులు చేసినా 2024లో జగన్‌ మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మలిశెట్టి వెంకటరమణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన చిట్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న పారదర్శక పాలన పట్ల ప్రజాభిమానం పెరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ 85 శాతం స్థానాలలో విజయం సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు అడ్డాలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అధిక స్థానాలు కైవసం చేసుకోవడం జగనన్న పాలనకు ప్రజామద్దతు లభించినట్లైందన్నారు.

నల్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు



నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు చేశారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగుల చవితి పూజలు

గాలివీడు : నాగుల చవితి రోజు నాగుల పుట్టకు పూజలు చేసిన మహిళలకు సర్వం మంగళకరమని వేదపండితులు నాగఫణి కిషోర్‌ శర్మ పేర్కొన్నారు. ఆదివారం శ్రావణ మాసం శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా మహిళలు వేకువజామునే ఇంటిల్లిపాది ఉపవాస దీక్షలతో పుట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా నాగుల చవితి పర్వదినాన్ని హిందూ సనాతన సంప్రదాయ ఆచారల మేరకు భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకుంటున్నారు.

ఆంజనేయుడికి..

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి కోటగడ్డపై వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే స్వామివారిని భక్తులు దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆంజనేయస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఓబులవారిపల్లె : క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని రాజంపేట డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. ఆదివారం వైకోట గ్రామంలో పోలీస్‌-11, వైకోట-11 జట్ల మధ్య వైకోట గ్రామంలో స్నేహపూర్వక క్రికెట్‌ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ-11, వైకోటల మధ్య జరిగిన క్రీడాపోటీలలో వైకోట జట్టు విజేతగా నిలిచింది. సమస్యాత్మకమైన గ్రామం వైకోటలో పోలీసులు క్రీడాపోటీలు పాల్గొనడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాపోటీలలో ముక్కా సాయివికాస్‌ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌ రెడ్డి, ఎస్‌ఐ శ్రీకాంత్‌ రెడ్డి, వైకోట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌ సెక్రటరీలపై పనిభారం తగ్గించండి



మాట్లాడుతున్న లీలావతి

రాయచోటి అర్బన్‌ : ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్‌ సెక్రటరీలపై పనిభారాన్ని వెంటనే తగ్గించేలా చూడాలని గ్రామ, వార్డు సచివాలయ హెల్త్‌ సెక్రటరీస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా స్థాయి గ్రామ, వార్డు హెల్త్‌ సెక్రటరీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి 3 వేల జనాభాకు ఒక ఏఎన్‌ఎంను నియమించాలన్నారు. హెల్త్‌ సెక్రటరీలకు బదిలీల అవకాశం కల్పించాలంటూ కోరారు. హెల్త్‌ సెక్రటరీలకు 2022 పీఆర్‌సీ ప్రకారం రెగ్యులర్‌ ఏఎన్‌యంతో సమానంగా వేతనాలు, సెలవుల సౌకర్యాన్ని కల్పించాలంటూ కోరారు. ప్రతిరోజు 80 రకాల యాప్‌లలో సమాచారాన్ని అప్‌లోడ్‌ చేయాల్సి వస్తుండడం, ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు నాణ్యతలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాణ్యమైన ట్యాబ్‌లను అందజేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, పుల్లయ్య, అంగన్‌వాడీ నాయకురాళ్లు సరోజమ్మ, రెడ్డికళ, ఉషారాణి, శ్రీవిద్య, ఎల్లమ్మ, రాణెమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

రాయచోటి అర్బన్‌ : రజకులను షెడ్యూల్డ్‌ కులాల జాబితాలో చేర్చేంత వరకు పోరాటం చేస్తామని అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, వి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని బేతల్‌కాలనీలో జిల్లాస్థాయి రజక సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చాలా రాష్ట్రాలలో రజకులు ఎస్సీ, ఎస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రంలోనూ తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని, దేవాలయాల్లో రజకులను చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా నియమించి రజకుల ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ కోరారు. జీఓ నం.27 ప్రకారం ఆసుపత్రులు, పోలీసులు, జైళ్ల శాఖలతో పాటు గురుకుల పాఠశాల, దేవాలయాల్లో దోబి పోస్టులు ఏర్పాటు చేసి శాశ్వత ప్రాతిపదికన రజకులను నియమించాలన్నారు. రజకుల కోసం నిర్మించిన దోబి ఘాట్‌లు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. 50ఏళ్ల పైబడిన రజకులకు పెన్షన్‌ సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్‌ చేశారు. సమావేశంలో పలువురు రజక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి



డాక్టర్‌ నవీద్‌ను సన్మానిస్తున్న నాయకులు, ప్రజలు

రామాపురం : ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కర్లపు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మాసన వెంకటరమణలు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్‌లో ఆదివారం కడపకు చెందిన హోలిస్టిక్‌ హాస్పిటల్‌ గుండె వైద్య నిపుణులు డాక్టర్‌ నవీద్‌ అహమ్మద్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి పైగా రోగులకు చికిత్స చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, మునీర్‌బాషా, సలీం, అయూబ్‌ ఆలీఖాన్‌, మజహరుల్‌ హక్‌, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికంలో వైఎస్సార్‌సీపీ హవా

ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ నిర్వహించిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ మద్దతుదారుల హవా కనిపించింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 12 వార్డు మెంబర్‌ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్‌ విడుదల చేయగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 11 చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఒక స్థానంలో టీడీపీ మద్దతుదారుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

– ఓబులవారిపల్లె



1



2



3



4



5



6



7



8



9



10



11



12

1.పి. సుబ్బమ్మ, రాళ్లచెరువుపల్లి, ఓబులవారిపల్లె
2.టి.విశ్వనాథ్‌, బోటుమీదపల్లి, ఓబులవారిపల్లె
3.పి.పెంచలయ్య,బిపి రాచపల్లి, ఓబులవారిపల్లె
4.ఎన్‌. శంకరమ్మ, శెట్టిగుంట, రైల్వేకోడూరు
5.సుబ్బయ్య, రంగంపల్లి, పుల్లంపేట
6.రామ తులసమ్మ, కోనెయ్యగారిపల్లి, పుల్లంపేట
7.ఎ.వెంకటమ్మ, వత్తలూరు, పుల్లంపేట
8.జె.సుబ్బమ్మ, పుత్తనవారిపల్లి, పుల్లంపేట
9.సయ్యద్‌ రిజ్వాన్‌, అప్పయ్యరాజుపేట, పుల్లంపేట
10.ఎ.సుబ్రమణ్యం, ఓబనపల్లి, రైల్వేకోడూరు
11.ఎనమల శివయ్య, బొజ్జావారిపల్లి, రైల్వేకోడూరు
12. కుమారి, ఎస్‌ఆర్‌ పురం, పెనగలూరు (టీడీపీ)

రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలంలో ఏకగ్రీవాలు



కె.సంగీత, ప్రకాశ్‌ నగర్‌ కాలనీ, 8వ వార్డు



బిక్కి రెడ్డమ్మ, మోటుకట్ల 4వ వార్డు